

గిరిజన విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, గిరిజనశాఖ కార్యదర్శి శరత్ తదితరులు

# గిరిజన బిడ్డ ఐఐటీకి ఆర్థిక సాయం

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): పాట్నా ఐఐటీలో సీటు సాధించిన సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండా విద్యార్థిని బాదావత్ మధులత ఆర్థిక పరిస్థితులపై మీడియాలో వచ్చిన కథనాలకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. సీఎం ఆదేశం మేరకు గిరిజనశాఖ అధికారులు మధులత కుటుంబాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సచివాలయంలో గిరిజనశాఖ కార్యదర్శి శరత్ విద్యార్థినికి రూ.1,51,831 చెక్కు అందజేశారు. హైఎండ్ కంప్యూటర్ కోసం ఇప్పుడిచ్చిన రూ.70 వేలకు అదనంగా మరో రూ.30 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పాలిసెట్ స్పెషల్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్ కాలేజీలలో మిగులు సీట్ల భర్తీకి నేటి (శుక్రవారం)నుంచి స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్నట్టు అడ్మిషన్ కన్వీనర్ దేవసేన గురువారం ప్రకటన విడుదల చేశారు. 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 27 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 31న సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## 26 నుంచి ఎప్‌సెట్ సెకండ్ ఫేజ్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కాలేజీలలో సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ దేవసేన తెలిపారు. గురువారం షెడ్యూల్ విడుదల చేశారు. 26న కౌన్సెలింగ్‌కు ఫీజు చెల్లింపుతో పాటు స్లాట్ బుకింగ్ ఉంటుంది. 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 27 నుంచి 28 వరకు ఆప్షన్ల నమోదు, 31న సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేయనున్నట్టు అడ్మిషన్ కన్వీనర్ తెలిపారు. వివరాలకు https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

# గుండారెడ్డి పల్లెలో నిజాం శాసనం



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డి పల్లెలోని మత్తడి పోషమ్మ గుడి దగ్గర నిజాం కాలం నాటి శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యులు అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీరుద్దీన్ తాజాగా గుర్తించారు. ఈ శాసనం 19వ శతాబ్దపు తెలుగు లిపిలో ఉన్నది. ఇందులో అప్పటి పాలనా భాష పార్సీ పదాలు ఉండటం విశేషం. 16 పంక్తుల ఈ చిన్న శాసనం నిజాం పరిపాలకులు నీటి పారుదల వ్యవస్థ పట్ల చూపిన శ్రద్ధ, బాధ్యతలను వివరించింది. ప్రభుత్వాధికారి బహాజోయి హకుందెన్ సాహెబ్ బహదూర్ జమావం(ద) కొండలరావు గుండారెడ్డిపల్లె చెరువు మత్తడికిచ్చిన ఆయలు(ఆదాయం) హిజ్రీ సం.1246 నుంచి 1250 వరకు చెల్లిన విషయం ఈ శాసనంలో పేర్కొన్నారు.

# ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను డిస్మిస్ చేయండి

**అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక డిమాండ్**

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): దివ్యాంగులను కించపరిచేలా ఎక్స్‌వేదికగా వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను డిస్మిస్ చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక డిమాండ్ చేసింది. వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు నేతృత్వంలో దివ్యాంగ హక్కుల, సంక్షేమ సంఘాల నేతల బృందం వికలాంగుల సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులపై సానుభూతి చూపాల్సిన అధికారి కించపరిచేలా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమని వివరించారు. ఐఏఎస్ అధికారిగా కొనసాగే నైతిక విలువలను కోల్పోయారని, స్మితా సబర్వాల్‌ను దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం శిక్షించి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు పులిపాటి శ్రీనివాస్, జంగిల్ శ్రీనివాస్, అందే దయమణి, తాళ్ల మాధవి, మాలెల్ల డేవిడ్, మహేందర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# 'దక్షిణమధ్య రైల్వే' మేనేజర్‌గా పద్మజ

**ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళ**

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా ఎంఎస్‌కే పద్మజ సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆ బాధ్యతలను స్వీకరించిన మొట్టమొదటి మహిళా కావడం విశేషం. ఆమెకు రైల్ నిలయం అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## రాజ్యాంగ అధికార పరిధిని రాష్ట్రాలు దాటరాదు

న్యూఢిల్లీ, జూలై 25: రాజ్యాంగం ప్రకారం తమ పరిధికి మించిన అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు చొరబడలేవని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం విదేశీ వ్యవహారాలు, ఇతర దేశాలతో సంబంధాల అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికే విశేషాధికారం ఉంటుందని పేర్కొన్నారు. ఇది పూర్తిగా కేంద్రానికి సంబంధించిన అంశమని, ఉమ్మడి జాబితాలో లేదని అన్నారు. ఐఏఎస్ అధికారిణి కే వాసుకిని విదేశాంగ కార్యదర్శిగా నియమిస్తూ కేరళ ప్రభుత్వం ఇటీవల అసాధారణ నిర్ణయం తీసుకొన్న నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ మేరకు స్పందించింది. కార్మిక, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న ఆమెను విదేశీ సహకారానికి సంబంధించిన అంశాలు సైతం చూసుకోవాల్సిందిగా కేరళ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

# ఇనుప ట్రంకు పెట్టెలకు చెల్లుచీటీ

- రైలు డ్రైవర్లు, గార్డులకు ట్రాలీ బ్యాగ్‌లు
- అన్ని జోన్లకు రైల్వే బోర్డు ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 25: రైళ్లలో విధులు నిర్వర్తించేందుకు వెళ్లే లోకో పైలట్లు (డ్రైవర్లు), గార్డులు తమకు అవసరమైన వస్తువులను వెంట తీసుకెళ్లేందుకు ఎన్నో ఏండ్ల నుంచి ఇనుప ట్రంకు పెట్టెలనే ఉపయోగిస్తున్నారు. కానీ, వాటి స్థానంలో ట్రాలీ బ్యాగ్‌లను అందించేందుకు రైల్వే బోర్డు చాలా కాలం నుంచి ప్రయత్నిస్తున్నది. ఇప్పుడు ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే త్వరలో రైలు డ్రైవర్లు, గార్డుల చేతుల్లో ట్రంకు పెట్టెలకు బదులుగా ట్రాలీ బ్యాగ్‌లు దర్శనమివ్వనున్నాయి. లోకో పైలట్లు, గార్డులకు ట్రాలీ బ్యాగ్‌లను అందజేయాలని రైల్వే బోర్డు ఇటీవల తమ అన్ని జోన్ల అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన విధాన నిర్ణయాన్ని అమలు చేయాలని ఈ నెల 19న రాసిన లేఖలో పేర్కొన్నది.

# జమ్ముకశ్మీర్, మణిపూర్‌కు వెళ్లకండి

**తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ**

వాషింగ్టన్, జూలై 25: భారత్‌లో పర్యటించే అమెరికా దేశస్థులకు ఆ దేశ హోం శాఖ ట్రావెల్ అడ్వైజరీ జారీచేసింది. జమ్ముకశ్మీర్, మణిపూర్‌కు వెళ్లొద్దని సూచించింది. ఉగ్రవాదం ముప్పు ఉన్న నేపథ్యంలో జమ్ముకశ్మీర్, భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధి వరకు వెళ్లొద్దని పేర్కొన్నది. నక్సలైట్ల ప్రభావం ఉన్న తూర్పు, మధ్య భారతంలోనూ, హింస చెలరేగిన మణిపూర్‌నకు వెళ్లొద్దని సూచించింది.

# 'నీట్'పై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**నీట్ పరీక్షతో లాభం కంటే నష్టమే ఎక్కువ**

**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): నీట్ పరీక్షతో లాభం కంటే నష్టమే ఎక్కువ అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాయడం ద్వారా నష్టం ఉందని, తెలంగాణలో పీజీ సీట్ల సంఖ్య ఎక్కువ అని, నీట్ నుంచి వైదొలుగితేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు నీట్ నుంచి వైదొలుగుతున్నట్టు శాసన సభల్లో తీర్మానాలు చేసినట్టు గుర్తు చేశారు. తెలంగాణ కూడా శాసనసభలో నీట్ నుంచి వైదొలుగుతున్నట్టు తీర్మానం చేయాలని కోరారు. వైద్య విద్య కోర్సులు చదువుకోవాలని ఆశపడే విద్యార్థులకు నీట్ పరీక్ష ఒక ఎంట్రన్స్ మాత్రమేనని తెలిపారు. ఇటీవల నీట్ పేపర్ లీకేజీతో అపనమ్మకం ఏర్పడిందని వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణలో మొత్తం 54 మెడికల్ కళాశాలల్లో 27 ప్రభుత్వ, 23 ప్రైవేట్, 4 మైనార్టీ మెడికల్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. దేశంలో 706 మాత్రమే మెడికల్ కళాశాలలు ఉన్నాయని, లక్ష ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఇందులో 10 శాతం సీట్లు తెలంగాణవేనని పేర్కొన్నారు. 8265 మంది విద్యార్థులు తెలంగాణలోనే వైద్య విద్యను చదువుతున్నారని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో సీట్ల సంఖ్య పెరిగిందని వివరించారు.

# మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేతగా మధుసూదనాచారి



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేతగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. అనంతరం మండలిలో తనను బీఆర్‌ఎస్ పక్ష నేతగా నియమించిన పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావును మధుసూదనాచారి కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన మధుసూదనాచారి తొలి తెలంగాణ శాసనసభాపతిగా పనిచేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత అయిన మధుసూదనాచారి తెలంగాణ ఉద్యమకారుడిగా, బహుజన పక్ష నేతగా గుర్తింపు ఉన్నది. సుదీర్ఘ పోరాట అనుభవం, అపారమైన జ్ఞానం, సామాజిక విజ్ఞత కలిగిన మధుసూదనాచారి మరిన్ని విజయాలు సాధించాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రావణ్‌కుమార్ గురువారం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రజల గొంతుకగా, తెలంగాణ అభివృద్ధికి తోడ్పడే చోదకశక్తిగా ముందుకు సాగాలని కోరారు.











